క్లుప్తంగా

భరత్ గెలుపు కోసం ఎంపీపీ ప్రచారం



కంచిబందార్లపల్లెలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ వరలక్ష్మి

గుడుపల్లె: కుప్పం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్‌జే భరత్‌ను వచ్చే ఎన్నికలలో ఓట్లు వేసి గెలిపించాలని ఎంపీపీ వరలక్ష్మి ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని కంచిబందార్లపల్లె, చిన్న బందార్లపల్లె గ్రామాలలో ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థితోపాటు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని కరపత్రాలు అందజేశారు. భరత్‌ను గెలిపిస్తే మరెంతో అభివృద్ధి చేస్తారని, అందరికీ అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రామక్రిష్ణ, సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం స్వాధీనం చేసుకుని నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ క్రిష్ణయ్య

బైరెడ్డిపల్లె: తమిళనాడు నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ క్రిష్ణయ్య బుధవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం...మండలంలోని లక్కనపల్లె వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. లక్కనపల్లెకు చెందిన శీనప్ప ఆటోలో 750 కేజీల రేషన్ బియ్యం తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. వాహనంతో సహా బియ్యాన్ని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్ట్ చేశారు.

షెడ్డు గోడను కూల్చి.. దాణా తినేసి..!

- ఒంటరి ఏనుగు హల్‌చల్



ఏనుగు ధ్వంసం చేసిన షెడ్డు గోడ

పలమనేరు: మండలంలోని ముసలమడుగులో బుధవారం వేకువజామున ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది.పొలాల వద్ద కాపురముంటున్న రామచంద్ర షెడ్డు గోడను కూల్చి వేసింది. గదిలోని పశువుల దాణాను తినేసింది. పక్కనే ఉన్న అరటి, వరి పంటలను నాశనం చేసింది. తనకు జరిగిన నష్టం గురించి అటవీ అధికారుల దృష్టికి బాధిత రైతు నివేదించాడు. ఇదలా ఉంచితే, కొన్నాళ్లుగా ఈ ప్రాంతానికి రాని ప్రమాదకర ఒంటరి ఏనుగు మళ్లీ రావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

తరాల కష్టం తీరింది

జాతీయ రహదారికి కిలోమీటరు దూరంలోనే ఉన్నా ఆ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. మట్టిరోడ్డు మూలాన వర్షాకాలంలో అయితే ఇబ్బందులు చెప్పనవవి కాదు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్సు, ఆటోలు రావాలన్నా సాధ్యమయ్యేది కాదు. రోడ్డు వేయించండి మహాప్రభో! అని దశాబ్దాల కాలంలో పాలకులకు లెక్కలేనన్ని సార్లు వినతులు ఇచ్చినా పట్టించుకున్న పాపానపోలేదు. ఆ గ్రామ మూడు దశాబ్దాల కలను ప్రస్తుత ప్రభుత్వం సాకారం చేసింది. తారు రోడ్డు వేసి రవాణా సదుపాయాలు కల్పించడంతో వారి ఆనందానికి హద్దుల్లేకుండా పోయింది.

- పోడుచేన్లుకు తారు రోడ్డు కల సాకారం



2015 ఆగస్టులో తమ రోడ్డు దుస్థితిని ప్రజాప్రతినిధులకు చూపుతున్న పోడుచేన్లు గ్రామస్తులు (ఫైల్)



పోడుచేన్లుకు కొత్తగా వేసిన తారురోడ్డు

శాంతిపురం: మండలంలోని కడపల్లె పంచాయతీ పోడుచేన్లు గ్రామంలో 63 కుటుంబాలు నివాసం ఉన్నాయి. ఇక్కడ మొత్తం జనాభా దాదాపు 300 వరకూ ఉన్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారీ మట్టి రోడ్డు కోతకు గురై కాలినడకకు కూడా కష్టంగా మారేది. గుంతలమయమై, రాళ్లురప్పలు తేలిన ఆ మార్గంలో ద్విచక్రవాహనాలపై ఫీట్లు చేస్తూ వెళ్లాల్సి వచ్చేది. కనీసం మరమ్మతులు చేయండి సారూ అని కోరినా అప్పటి పాలకులు దయ చూపకపోతే పండుగల సమయాల్లో గ్రామస్తులే చందాలు వేసుకుని కోతకు గురైన చోట్ల మట్టిని తోలించేవారు. ఈ బాధల నుంచి తమను గట్టెక్కించాలని స్థానిక నాయకులు, అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా, అధికారిక కార్యక్రమాల్లో అర్జీలు ఇచ్చినా, రోడ్డు కోసం ముఖ్య, ప్రధానమైన నేతలకు వినతి పత్రాలు ఇచ్చినా అవన్నీ బుట్టదాఖలయ్యాయి. 2015లో ఈ ప్రాంతంలో విమానాశ్రయం నిర్మిస్తామని హడావుడి చేసిన సమయంలోనూ తమ రోడ్డు కష్టాన్ని గట్టిగా వినిపించారు. విమానాశ్రయానికి భూ సేకరణ కోసం రైతులను ఒప్పించేందుకు అదే ఏడాది ఆగష్టు 30న మండల స్థాయి ప్రజాప్రతినిధులు కడపల్లె–పోడుచేన్లు నడుమ పొలాల్లో భూ యజమానుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆ రోజు సమావేశానికి వచ్చిన అప్పటి ప్రజాప్రతినిధులను కలిసి గ్రామస్తులు రోడ్డు కష్టాలను ఏకరువు పెట్టారు. గ్రామ మహిళలు మరో అడుగు ముందుకు వేసి తమ రోడ్డు దుస్థితిని ప్రత్యక్షంగా చూడాలంటూ నిలదీయడంతో మహిళలు, గ్రామస్తులతో కలిసి దాదాపు 400 మీటర్లు ఆ ప్రజా ప్రతినిధులు ఆ రోడ్డుపై నడిచారు. రాళ్లు తేలి, కోతకు గురై దుస్థితిలో ఉన్న రోడ్డులో నడవలేక ఆపసోపాలు పడ్డారు. చివరకు తాము రోడ్డును బాగు చేయిస్తామని హామీ ఇచ్చి వెనుదిరిగారు. ఆ తర్వాత ఇటుకేసి వారు రాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం రోడ్డును వేయడంతో వారి కష్టాలు తొలగిపోయాయి.

మా కష్టం తీర్చారు



రోడ్డు బాగాలేక మా ఊరికి ఆటోలు కూడా వచ్చేవి కాదు. బైకులపై వెళ్తూ పడి కూడా చాలా మంది దెబ్బలు తగిల్నాయి. ఊర్లో ఉండేవాళ్లంతా నేరుగా కుప్పంలో, కడపల్లెలో అర్జీలు చాలామందికి ఇచ్చినాము. చాలాతూర్లు మండలాఫీసులో ఆఫీసర్లను, నాయకులను మా బాధలు చెప్పినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు ఈ ప్రభుత్వం తారు రోడ్డు ఏపిచ్చింది. మా కష్టాల్ని తీర్చింది.

–చిన్నపాప, పోడుచేన్లు

నరకయాతన తప్పింది



ఊర్లో నుంచి రోడ్డుకు రావాలన్నా, తిరిగి ఇంటికి వెళ్లాలన్నా రాళ్లు తేలిన రోడ్డులో నరకయాతనగా ఉండేది. కొత్తగా మా ఊరికి వచ్చిన వాళ్లు రెండోసారి వచ్చేదానికి ఇష్టపడే వాళ్లు కాదు. రోడ్డు వల్ల అబ్బాయిలు, అమ్మాయిల పెళ్లి సంబంధాలు కుదరడం కూడా లేటయ్యేది. 30 ఏండ్లుగా ఎన్నో బాధలు పడతాంటిమి. ఎందరికో రోడ్డు గురించి చెప్పుకుంటిమి. ఇన్నేండ్లుగా ఎవరూ పట్టించుకోలా. ఇప్పటి ప్రభుత్వం రోడ్డు వేసి కష్టాలు లేకుండా చేసింది.

–వాణిశ్రీ, పోడుచేన్లు

కష్టం తీర్చారు

ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటైన నెల రోజుల్లోనే పోడుచేన్లు రోడ్డుకు మట్టిని తోలించి గ్రామీణులకు ఊరటనిచ్చింది. ఆ తర్వాత కాలంలో తారు రోడ్డు వేయించాలని గ్రామస్తులు కొందరి దృష్టికి తీసుకెళ్లి సమస్యను నివేదించారు. దీంతో వారి సమస్యకు పరిష్కారం లభించింది. సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో తారు రోడ్డు నిర్మాణానికి రూ 1.10 కోట్లను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో శరవేగంగా పనులు పూర్తి చేశారు. తారు రోడ్డును ప్రారంభించారు. దీంతో తమ కష్టాలు శాశ్వతంగా తీరాయని గ్రామస్తులు సంబరపడుతున్నారు. అంతేకాకుండా ఇప్పుడు రవాణా సదుపాయాలు మెరుగు పడ్డాయి.

పెద్దాయన కోసం సైనికుల్లా పనిచేయాలి



యువతతో సమావేశమైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులు

- చారాల యువతతో పెద్దిరెడ్డి భేటీ

చౌడేపల్లె: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పెద్దాయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీవీ మిథున్‌రెడ్డిల విజయంతోపాటు అత్యధిక మెజార్టీ సాధించడానికి గ్రామాల్లోని యువత సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి కోరారు. బుధవారం రాత్రి చారాలలో యువ నాయకుడు ప్రమోద్‌రెడ్డి నివాసంలో ఆ గ్రామ యువతతో పెద్దిరెడ్డి సమావేశమయ్యారు. గ్రామాల్లో యువత వైఎస్సార్‌సీపీకి మద్దతునివ్వాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి చారాల పంచాయతీలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కుటుంబాలు పొందిన లబ్ధిని ప్రతి ఇంటికీ వెళ్లి తెలియజేయాలని కోరారు. అలాగే, యువతతో పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. పార్టీకోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపునిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్, నేతలు రమణారెడ్డి, శివశంకర్‌రెడ్డి, మునిరాజ, జీవన్, రెడ్డెప్ప, గోవిందు, వెంకట్రమణ ,శ్రీనివాసులు, రజనీకాంత్, ప్రకాష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఈఓ

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని బుధవారం డీఈఓ దేవరాజులు తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అవకతవకలకు తావులేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పదోతరగతి పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

● నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: మండలంలోని జవ్వనపల్లె పంచాయితీ కె.నక్కనపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నారాయణప్ప బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ వేర్వేరు సమయాల్లో మృతుని గ్రామానికి వెళ్లి, అతడి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ తమీమ్, నాయకులు బాలాజి, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఓ చెక్‌పోస్టు మూత



మూతబడిన ఆర్టీఓ కార్యాలయం

పలమనేరు: పట్టణ సమీపంలోని రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాన్ని రెండ్రోజుల క్రితం మూసేశారు. రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ సెక్రటరీ ప్రద్యుమ్న నుంచి ఆదేశాలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నట్టు స్థానిక కార్యాలయ అధికారులు తెలిపారు. డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడంతో యాప్ ద్వారా పన్నుల చెల్లింపును కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుండటం విదితమే. ఈ నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌లో భాగంగానే దీనిని మూసివేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల కోడ్ పూర్తయ్యాక వీటిని కొనసాగిస్తారా? లేదా? అనే విషయంపై ఇంకా క్లారిటీ లేదని అధికారులు చెప్పారు.

48 గంటల్లో ఫైబర్‌నెట్ సమస్యల పరిష్కారం

తిరుపతి సిటీ : ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ సంస్థ బాక్సుల్లో సాంకేతిక సమస్యల కారణంగా ప్రసారాల్లో అంతరాయం కలిగిందని ఆ సంస్థ ఎండీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనిచేస్తున్నారని, 48 గంటల్లో సమస్యను పరిష్కరించి తిరిగి ప్రసారాలను కొనసాగిస్తామని తెలియజేశారు. అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

23 నుంచి 'గడప గడపకు వైఎస్సార్ సీపీ'

- మోటార్ సైకిళ్ల ర్యాలీకి మంచి స్పందన
- ఇదే ఉత్సాహంతో మరింత జోరుగా ఇంటింటా ప్రచారం



మాట్లాడుతున్న ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా గడప గడపకు వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని ఈనెల 23 నుంచి మండలంలో ప్రారంభించనున్నామని, దీనికి ప్రతి ఒక్కరూ 'సిద్ధం' కావాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, బోయకొండ చైర్మన్ నాగరాజారెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డితో కలసి విలేకరులతో ఆయన మాట్లాడారు. నాలుగురోజులుగా మోటారుసైకిల్ ర్యాలీతో చేసిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, అలాగే పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపిందన్నారు. ఇదే ఉత్సాహంతో మండలంలోని 23 పంచాయతీల్లోనూ ఆయా సచివాలయాల పరిధిలో సర్పంచులు, ఎంపీటీసీలు, గృహసారథులు, కన్వీనర్లు, పార్టీ అభిమానులు , పెద్దిరెడ్డి అభిమానులు అందరూ కలసి 23 నుంచి గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, వాటితో లబ్ధి పొందిన కుటుంబాల గురించి కరపత్ర ప్రచారంతో వివరించాలన్నారు. ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డిలకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని ప్రజలకు మరోసారి చాటి చెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి, వెంకటరెడ్డి, రామకృష్ణారెడ్డి , గురివిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యోగనారాయణస్వామి అలంకారంలో శ్రీవారు



పుంగనూరు: పట్టణంలోని కోనేటివద్ద ఉన్న శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారిని యోగినారాయణస్వామి అలంకారంలో ఊరేగించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యుల బృందం హోమాలు, అభిషేక పూజలు నిర్వహించింది. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పట్టణంలో ఊరేగించారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

గంగవరం: ఓటు హక్కు వినియోగంపై బుధవారం పలమనేరు పట్టణంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ రోజు ప్రజలు తమ ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో మెప్మా అధికారులు అవగాహన కల్పించారు. ఈ ర్యాలీని అన్ని వార్డు సచివాలయాల్లో ఎన్నికల రోజు వరకూ నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం ఉమేష్‌రావు, జిల్లా కో–ఆర్డినేటర్ బాబా, సీఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం జోరు



పుంగనూరు: సుబేదారు వీధిలో..



పులిచెర్ల: శ్రీనివాసపురంలో..



పుంగనూరు: భగత్‌సింగ్‌కాలనీలో ఇంటింటా ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సాధ్యమని, ఉమ్మడి పార్టీల పాలన వస్తే బడుగులకు కష్టాలేనని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. బుధవారం ఆయన భగత్‌సింగ్‌కాలనీలో ఇంటింటా కరపత్ర ప్రచారం చేశారు. అలాగే సుబేదారువీధిలో సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్, కౌన్సిలర్ కిజర్‌ఖాన్, పట్టణంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లలిత, మున్సిపల్ కౌన్సిలర్లు జయభారతి, అర్షద్‌అలి, పూల త్యాగరాజు, జేపీ యాదవ్, కొండవీటి నటరాజ, రెడ్డెమ్మ, రేష్మా, మమత, భారతి, ఆదిలక్ష్మి, పద్మావతమ్మ ఆయా వార్డుల్లో జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మరోసారి ఫ్యాను గుర్తుకు ఓట్లేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు చెన్నరాయుడు, రాజు, పెంచుపల్లె కృష్ణప్ప పాల్గొన్నారు.

సదుం మండలంలో..

సదుం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని ఓట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని జాంద్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బుధవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిధున్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కరపత్ర ప్రచారం చేశారు. నియోజకవర్గం అభివృద్ధికి వారు ఎంతగానో కృషి చేశారని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, సర్పంచులు ఉషారాణి, వరలక్ష్మి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఆనంద, నాయకులు భాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, ఇమ్రాన్, మల్‌రెడ్డి, వెంకటరమణాచారి, కృష్ణయ్య, సయ్యద్‌బాషా, ఖాజాపీర్, కమ్రుద్దీన్, మస్తాన్, కాలేషా, దామోదర్‌రెడ్డి, చిన్న రమణ, ఇందాద్, దాము, రాజశేఖర్, వినోద్, వెంకటరెడ్డి, పుత్రాజు, ఎల్లారెడ్డి, మల్లికార్జున, వెంకటస్వామి, అంజాద్, రమణారెడ్డి, నారాయణరెడ్డి, అన్నారెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని చల్లావారిపల్లె పంచాయతీ శ్రీనివాసపురంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి వెంకట మిధున్‌రెడ్డిని మరోసారి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, సంతోష్, గోవింద రెడ్డి, ఎస్వీ రమణ, సదాశివరెడ్డి, షకీల్, హరి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదుం: ప్రచారం చేస్తున్న పెద్దిరెడ్డి, నాయకులు



పుంగనూరులో ప్రచారం చేస్తున్న దళిత నాయకులు

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు : ఆర్డీఓ

కుప్పం: గర్భిణులకు అబార్షన్లు, స్కానింగ్ సెంటర్లు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన ఆస్పత్రులు, క్లినిక్స్ మాత్రమే వైద్య సేవలు చేయవచ్చన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన పీసీపీ ఎన్‌డీటీ యాక్ట్‌పై కుప్పం డివిజన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖలో రిజిస్టర్ చేసుకున్న ఆస్పత్రులు, ల్యాబ్‌లు మాత్రమే ప్రాక్టీస్ చేయాలన్నారు.. రిజిస్ట్రేషన్ లేకుండా ఇష్టానుసారంగా ప్రాక్టీస్ చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. గర్భస్రావం చేసినా, లింగ నిర్ధారణ పరీక్షలను ప్రోత్సహించినా అలాంటి క్లినిక్స్, స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామన్నారు. అంతేకాకుండా పీసీపీ ఎన్‌డిటీ యాక్టు కింద 10 వేలు జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష తప్పదన్నారు. వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలకు లోబడి ప్రాక్టీస్ చేయాలని సూచించారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

గంగవరం: పలమనేరు మండలంలో పదవ తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా సాగాయి. 6 పరీక్ష కేంద్రాల్లో ఇంగ్లిష్ పరీక్షకు 1,307 మందికి గాను 1297 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ లీలారాణి తెలిపారు.